

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 273 | ఎడిటర్ : బరిగెల శివ | గురువారం 03, సెప్టెంబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# వెన్నుపోటుదారులే.. వేగిపరులు



దర్జాగా దేశాన్ని మోసం చేస్తూ "దేవుళ్ళు"..... అనిపించుకుంటున్నారు

లక్షల కోట్లు అప్పనంగా దానం చేయడానికి ఎవడబ్బ సొమ్ము అనుకుంటున్నారు

పేదల రుణాలను తీర్చగల సాహసం చేయని కేంద్ర ప్రభుత్వం

రైతు రుణాలపై కేసులు ఎందుకు కడుతున్నారు

దేశంలో ఒక మాట బయటదేశాల్లో మరో మాట నిజాయితీని బొంద పెడుతున్నారు

దగుల్బాజీ పనులను లెక్కలేయడంలో ఆరితేరిపోతున్నారు

విద్యార్థులపై పగబడుతూ దేశద్రోహులు అంటున్నారు

ప్రశ్నిస్తే కేసులు పెట్టడం దేశాన్ని నయవంచకులకు తాకట్టు పెట్టడమే

దేశానికి పట్టిన దరిద్రం పోవాలంటే దేశ పాలన మారాలి

లక్షల కోట్ల రూపాయలను మంచినీళ్లు మింగినట్టు మింగుతున్నారు : డాక్టర్ బరిగెల శివ





దేశంలో రాజకీయ నాయకుల స్వార్థపూరిత విధానాలతో ప్రజలపై భారం పెరుగుతోందని డాక్టర్ బరిగెల శివ ఆరోపించారు. పేదల రుణాలను పట్టించుకోకుండా పెద్ద మొత్తంలో రుణాలు పొందిన వ్యాపార సంస్థలకు వెసులుబాటు కల్పించడం సరికాదన్నారు. ప్రభుత్వాలను ప్రశ్నించే ప్రజలు, విద్యార్థులు, వివిధ వర్గాలపై కేసులు పెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. మతాలు, కులాల పేరుతో ప్రజలను విభజించి ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా ముద్ర వేయడం ఆపాలని కోరారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టి, వారికి పూర్తి భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. అధికార పార్టీల్లోకి నాయకులు మారడం ద్వారా గత ఆరోపణలు, కేసుల నుంచి తప్పించుకునే పరిస్థితులకు ముగింపు పలకాలని సూచించారు. దేశ ప్రయోజనాలు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని డాక్టర్ బరిగెల శివ పిలుపునిచ్చారు.

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2



డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

## ఓటుకు 'సర్' కత్తెర!


దేశవ్యాప్తంగా 13.37 కోట్ల ఓటర్ల పేర్లు గల్లంతు

ఢిల్లీ, తెలంగాణలో భారీగా తగ్గిన ఓటర్ల సంఖ్య

అర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపుపై ఆందోళన

పేదలు, వలస కార్మికులు, వృద్ధులపై తీవ్ర ప్రభావం

పారదర్శకతతో పాటు ఓటు హక్కు రక్షణకు డిమాండ్ : డాక్టర్ బరిగెల శివ




2

## నిందితుడి ఆత్మహత్య

అమూల్యశ్రీ కేసులో ఊహించని పరిణామం

బెయిల్‌పై విడుదలైన మహేష్ బలవన్మరణం

ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య

తప్పుడు కేసు బనాయించారంటున్న కుటుంబ సభ్యులు

మహేష్ మృతిపై పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు



2

## కొండా సురేఖపై వేటు?

ఏఐసీసీ తుది నిర్ణయంపై ఉత్కంఠ

మంత్రి పదవి నుంచి తప్పించే అంశంపై చర్చలు

అధిష్ఠానానికి తన వాదన వినిపించిన కొండా సురేఖ

జి. చిన్నారెడ్డి భవితవ్యంపైనా సందిగ్ధత

నేడు అధికారిక నిర్ణయం వెలువడే అవకాశం : డాక్టర్ బరిగెల శివ




2

## భద్రకాళి మాడవీధుల టెండర్‌పై ఉత్కంఠ!

రూ.19 కోట్లతో రెండో విడత మాడవీధుల నిర్మాణం

నేటితో టెండర్ల దాఖలుకు ముగియనున్న గడువు

సాయంత్రం సాంకేతిక బిడ్ల పరిశీలన

శుక్రవారం కాంట్రాక్టు ఖరారయ్యే అవకాశం

పాత కాంట్రాక్టర్‌కా.. కొత్త సంస్థకా?

3



# నిందితుడి ఆత్మహత్య

**అమూల్యశ్రీ కేసులో ఊహించని పరిణామం**
**బెయిల్‌పై విడుదలైన మహేష్ బలవన్మరణం**
**ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య**
**తప్పుడు కేసు బనాయించారంటున్న కుటుంబ సభ్యులు**
**మహేష్ మృతిపై పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు**

హైదరాబాద్ (జై భీమ్ న్యూస్):

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన షార్ట్‌ఫిల్మ్ నటి అమూల్యశ్రీ ఆత్మహత్య కేసులో మరో విషాదకర పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా అరెస్టై, జైలు జీవితం గడిపి ఇటీవలే బెయిల్‌పై విడుదలైన మహేష్ (19) ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం రేపుతోంది. సైదాబాద్ సింగరేణి కాలనీకి చెందిన మహేష్‌ను అమూల్యశ్రీ ఆత్మహత్య కేసులో పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొంతకాలం చంచల్‌గూడ జైలులో ఉన్న అతడికి ఇటీవల న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలై ఇంటికి చేరుకున్నాడు. అయితే బెయిల్‌పై బయటకు వచ్చిన కొద్దిరోజులకే మహేష్ తీవ్ర మనస్తాపంలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని అతడు బలవన్మరణానికి పాల్పడ్డాడని ప్రాథమిక సమాచారం. సమాచారం అందుకున్న సైదాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే మహేష్ మృతిపై అతడి కుటుంబ సభ్యులు సంచలన ఆరోపణలు చేస్తున్నారు. తమ కుమారుడిపై తప్పుడు కేసులు బనాయించారని, కేసు కారణంగా అతడు తీవ్ర మానసిక ఒత్తిడికి గురయ్యాడని ఆరోపిస్తున్నారు. ఈ వేధింపులు, మానసిక క్షోభ కారణంగానే తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహేష్ ఆత్మహత్య వెనుక అసలు కారణాలేమిటన్న దానిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. బెయిల్‌పై విడుదలైన తర్వాత అతడిని ఎవరైనా బెదిరించారా? ఎవరైనా ఒత్తిడి తీసుకొచ్చారా? కేసు విచారణపై భయంతోనే అతడు ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నాడా? అనే పలు కోణాల్లో విచారణ కొనసాగుతోంది. అతడి మొబైల్ ఫోన్, కాల్ డేటా, చివరిసారిగా ఎవరితో మాట్లాడాడు వంటి అంశాలను కూడా పరిశీలించే అవకాశం ఉంది. ఒకే కేసు నేపథ్యంలో అమూల్యశ్రీతో పాటు ప్రధాన నిందితుడిగా ఉన్న మహేష్ కూడా ప్రాణాలు కోల్పోవడం ఇప్పుడు పలు ప్రశ్నలకు దారితీస్తోంది. మహేష్ మరణం వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటి? కుటుంబ సభ్యులు చేస్తున్న ఆరోపణల్లో నిజమెంత? అనే అంశాలు పోలీసుల సమగ్ర దర్యాప్తులో తేలాల్సి ఉంది. అమూల్యశ్రీ కేసు ఇంకా చర్చనీయాంశంగానే ఉండగా.. ప్రధాన నిందితుడి ఆత్మహత్యతో ఈ కేసు మరోసారి సంచలనంగా మారింది.

# వెన్నుపోటు "దారులే" వేగిరపరులు

**దర్జాగా దేశాన్ని మోసం చేస్తూ "దేవుళ్ళు"..... అనిపించుకుంటున్నారు.**
**లక్షల కోట్లు అప్పనంగా దానం చేయడానికి ఎవడబ్బ సొమ్ము అనుకుంటున్నారు.**
**పేదల రుణాలను తీర్చగల సాహసం చేయని కేంద్ర ప్రభుత్వం.**
**రైతు రుణాలపై కేసులు ఎందుకు కడుతున్నారు.**
**దేశంలో ఒక మాట బయటదేశాల్లో మరో మాట నిజాయితీని బొంద పెడుతున్నారు.**
**దగుల్బాజీ పనులను లెక్కలేయడంలో ఆరితేరిపోతున్నారు.**
**విద్యార్థులపై పగబడుతూ దేశద్రోహులు అంటున్నారు.**
**ప్రశ్నిస్తే కేసులు పెట్టడం దేశాన్ని నయవంచకులకు తాకట్టు పెట్టడమే.**
**దేశానికి పట్టిన దరిద్రం పోవాలంటే దేశ పాలన మారాలి.**
**లక్షల కోట్ల రూపాయలను మంచినీళ్లు మింగినట్టు మింగుతున్నారు : డాక్టర్ బరిగెల శివ**

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

రాజకీయ నాయకుల అసలు రంగు దేశాన్ని అప్పులపాలు చేయడంపై ఆధారపడిందని డాక్టర్ బరిగెల శివ హెచ్చరించారు.రాజకీయ నాయకుల అంతర్గత రూపాలు దేశ నాశనాన్ని కోరుకుంటూ దేశాన్ని దరిద్రపు ఊబిలోనికి నెట్టివేస్తూ....ఆనంద పడుతుండగా రాజకీయ నాయకుల బహిర్గత రూపాలు కపట ప్రేమను కనపరుస్తున్నాయని విశ్లేషించారు.దేశంలో ముస్లింలు ప్రశ్నిస్తే పాకిస్తానీయులని,పాకిస్తాన్ ప్రేమికులని హీనంగా అవమానపరచడాన్ని దేశంలోని ముస్లింలు తట్టుకోలేకపోతున్నారు అన్నారు.హిందువులు ప్రశ్నిస్తే దేశద్రోహులుగా ముద్రిస్తూ నానా రకాల చిత్రహింసలు పెడుతున్నారు అన్నారు.క్రైస్తవులు ప్రశ్నిస్తే విదేశీ మతస్తులంటూ చిల్లర కూతలు కూస్తున్నారన్నారు.సిక్కులు ప్రశ్నిస్తే ఖలిస్తానీలు అంటూ అవమానపరుస్తున్నారని అదేవిధంగా ఆదివాసులు, గిరిజనులు ప్రశ్నిస్తే నక్సలైట్లుగా ముద్రిస్తున్నారని నిలదీశారు.దేశంలో జరుగుతున్న బాంబుల పేలుళ్ల దాడులకు దేశంలోపల జరుగుతున్న సంఘటనలుగా పరిగణిస్తూ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతున్నాయో పసిగట్టకుండా ఏ దాడి జరిగిన దానిని ముస్లింల వైపునెట్టడం, క్రైస్తవుల వైపునెట్టడం, ఆదివాసులు, గిరిజనుల వైపునెట్టడం, హిందువుల వైపునెట్టడం, రాజకీయ నాయకులకు అలవాటుగా మారిందని మందలించారు.12 సంవత్సరాలలో బీజేపి ప్రభుత్వం దేశాన్ని రెండు లక్షల కోట్ల అప్పులకు నెట్టేసి దేశాన్ని దరిద్ర రూపంగా నడిపిస్తూనే ఎక్కడలేని నిజాయితీపరుల్లాగా ఆరాధించబడుతున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు.ప్రశ్నిస్తున్న ప్రతి ఒక్కరిపై కేసులు పెట్టుకుంటూ పోతే దేశంలో 140 కోట్ల జనాభాలో కనీసం 100 కోట్ల జనంపై కేసులు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.దుబారాగాల్లు, దగుల్బాజీగాల్లు, దరిద్రులు,మోసగాళ్ళు,వ్యసనపరులు,వ్యాపారస్తులు,పైసా సంపాదకులు,దేశాన్ని పట్టి పీడిస్తున్నారని వాళ్ళందరిపై అధికార ప్రభుత్వం దృష్టి పెట్టాల్సింది పోయి దేశ ప్రజలను మనస్థాపానికి మానసిక వేదనలకు గురిచేస్తూ 140 కోట్ల ప్రజలు జీవించడానికి వీలు లేని విధంగా ప్రతి నెలకు ఒక నిత్యవసరాల వస్తువుల ధరలను పెంచుతూ దేశ ప్రజలను ఎంత అరిగోసపెట్టుకుంటుందో కేంద్ర ప్రభుత్వానికి కాస్తంతైన కనికరం లేకుండా పోతుందని హెచ్చరించారు.పేద ప్రజలపై పెంచుతున్న నిత్యవసరాల వస్తువుల ధరల నుండి సేకరిస్తున్న సొమ్మంతా వ్యాపారస్తులు బ్యాంకుల ద్వారా పొందుకుంటున్న రుణాలను ఏకకాలంలో మాఫీ చేస్తూ లక్షల కోట్ల రూపాయలను స్వల్ప సొమ్ముతో క్లియరెన్స్ లు ఇస్తున్నారని వాటిని ప్రశ్నిస్తున్న ప్రజాస్వామ్య వాదులపై మాత్రం కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని గుర్తు చేశారు.బ్రతికున్న వ్యక్తులను దేవుళ్ళుగా కొలిచే విధంగా ఆలయాలు కట్టడానికి ప్రభుత్వ స్థలాలు కేటాయించడానికి 112 కోట్ల నిధులను సమకూర్చడానికి దేశంలోని ఈ విధమైనటువంటి దరిద్ర పరిస్థితులు దాపిరిస్తున్నాయంటే దేశాన్ని రక్షించడం భగవత్ స్వరూపం వల్ల కూడా కాదేమోనని అనుమానాలను,ఆశ్చర్యంను వ్యక్తం చేశారు.

**తల్లడిల్లుతున్న భరతమాత..**

దేశంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, మానభంగాలు, బలవంతపు రేపులు, బలవన్మరణాలు, భరతమాతను కన్నీరు పెట్టిస్తున్నాయని వాటన్నిటికీ కారణం దేశాన్ని పాలిస్తున్న వెన్నుపోటు దారులేనంటు హెచ్చరించారు.పైకి నటించిన అంత సులభంగా రాజకీయ నాయకుల లోలోపలి మనస్తత్వం స్పష్టత లేకుండా పోతుందని సూటిగా నిలదీశారు.భరతమాతను కనీసం గౌరవించని వ్యక్తులు దేశంలో గౌరవప్రదమైన హోదాలను కలిగి ఉన్నారని వారి వల్ల భరతమాతకు అవమానం జరుగుతుందని గుర్తు చేశారు.దేశవ్యాప్తంగా లక్షల సంఖ్యలో కోట్ల సంఖ్యలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందని జాతీయవాదం కాస్త జాతి ద్రోహంగా మారుస్తున్నారని హెచ్చరించారు.మణిపూర్ లాంటి ప్రాంతాన్ని ఉత్తరప్రదేశ్ లాంటి ప్రాంతాన్ని ఆంధ్రప్రదేశ్ లాంటి ప్రాంతాన్ని గుజరాత్ లాంటి ప్రాంతాన్ని మధ్యప్రదేశ్ పశ్చిమబెంగాల్ లాంటి ప్రాంతాల్లో మహిళల పరిస్థితి ఎంతటి దారుణంగా ఉందో దేశ ప్రజలు గమనించాల్సిన అవసరం ఉందన్నారు.రాజకీయ నాయకులు అనేవాడు పాపాలు చేసిన, మోసాలు చేసిన, ప్రజలను దోచుకున్న, వ్యవస్థలను నాశనం చేసిన, వానికి పెద్దగా నష్టమేంలేదని ఎటుచూసిన భారం అంతా సామాన్యులే మోయాల్సి వస్తున్నందున జాతి భావం, జాతీయ భావం, భారతమాత స్వరూపం పూర్తిగా దెబ్బతింటుందని వాపోయారు.ఎన్ని దరిద్రపు పనులు చేసిన రాజకీయ నాయకుడనేవాడు అధికార పార్టీలోకి మారిపోతే అన్ని మాఫీ అయిపోతున్నాయని 12 ఏళ్లుగా దేశ రాజకీయాల్లో జరుగుతున్న దరిద్రపు రాజకీయ వలసవాదులను గమనిస్తుండగా స్పష్టంగా తెలిసిపోతుంది అన్నారు.ప్రతి రాష్ట్రంలో నిండు అసెంబ్లీలో, దేశంలో నిండు పార్లమెంటు ఉభయ సభల్లో ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ప్రభుత్వాలను ఎదిరిస్తూ ప్రభుత్వాలకు తలొగ్గకుండా నిజాయితీగా నిలబడడానికి ప్రయత్నం చేసిన రాజకీయ నాయకులందరూ 90 శాతం పార్టీలు మారి అధికార పార్టీలోనికి చేరి రాజకీయ వ్యభిచారానికి ఆద్యం పోస్తున్నారని హెచ్చరించారు.దేశంలో పెరిగిపోతున్న వెన్నుపోటు దారుల వల్ల రాజకీయాలు భ్రష్టుపడిపోతూ సాధారణ ప్రజల జీవన విధానంపై పెద్ద ఎత్తున భారం పడుతుందని గుర్తు చేశారు.దేశాన్ని నాశనం చేయడానికి వేగిరిపడుతున్న వేగిరిపరులంతా దేశద్రోహులేనంటు అభివర్ణించారు.మతపరమైన రాజకీయాలు, కులపరమైన రాజకీయాలు, స్వార్థపరమైన రాజకీయాలు, వ్యాపార పరమైన రాజకీయాలు, వ్యసనపరమైన రాజకీయాలు, అర్హత లేని రాజకీయాలు, ఆర్థిక మోసాలతో కూడిన రాజకీయాలు అడుగంటిపోయినప్పుడే దేశానికి మేలు జరుగుతుందని అలాంటి ప్రభావితమైన పరిస్థితులను దేశంలో ఏర్పాటు చేసుకోవడానికి 140 కోట్ల జనం స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.రాజకీయ నాయకులు పూర్తి స్వార్థంతో ఉన్నారని ప్రజలు మాత్రమే వాళ్ళ హక్కులను కాపాడుకోగలిగాలని మరొకసారి సూచించారు.ఎవరు దేశభక్తులో ఎవరు దేశద్రోహులో ఎవరు వెన్నుపోటు దారిలో ఎవరు వ్యవస్థల నాశనంలో వేగిరపాటు దారులో కాలం నిర్ణయిస్తుందంటూ హెచ్చరించారు.భయంకరమైన మోసాలు చేసి తప్పించుకుంటామని భావించుకుంటున్న ప్రతి ఒక్కడు కర్మ సిద్ధాంతానికి బలి కావాల్సిందేనంటూ హెచ్చరికలు జారీచేశారు.

# ఓటు హక్కుకు 'సర్' కత్తెర..

## దేశవ్యాప్తంగా 13.37 కోట్ల ఓటర్ల పేర్లు గల్లంతు! డాక్టర్ బరిగెల శివ

హైదరాబాద్ (జై భీమ్ న్యూస్)

ఓటు అనేది ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత కీలకమైన హక్కు. ప్రభుత్వాలను ఎన్నుకునే అధికారం, పాలకులను మార్చే శక్తి, ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచే ఆయుధం ఓటు. అలాంటి ఓటు హక్కుపైనే ఇప్పుడు ప్రత్యేక సమగ్ర సవరణ---స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)---పేరుతో భారీ కోత పడుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దేశవ్యాప్తంగా మూడు దశల్లో ఇప్పటివరకు 13.37 కోట్ల మంది ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాల నుంచి తొలగించబడినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇది సర్ ప్రక్రియకు ముందు ఉన్న మొత్తం ఓటర్ల సంఖ్యతో పోలిస్తే దాదాపు 14.1 శాతం. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలోనే ప్రతి ముగ్గురు ఓటర్లలో ఒకరి పేరు డ్రాఫ్ట్ జాబితాలో కనిపించకపోవడం, తెలంగాణలో 21.7 శాతం ఓటర్ల పేర్లకు కోత పడటం, మహారాష్ట్రలో రెండు కోట్లకు పైగా పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో లేకపోవడం ఇప్పుడు ప్రజాస్వామ్యంపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ సర్ ప్రక్రియలో ఇప్పటికే నమోదైన ఓటర్లు కూడా తమ వివరాలను మళ్లీ ధృవీకరించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఎన్యూమరేషన్ ఫారం సమర్పించడం, పాత ఓటర్ల జాబితాలో తమ పేరు లేదా తల్లిదండ్రుల పేర్లతో మ్యాపింగ్ చేసుకోవడం, అవసరమైన పత్రాలను సమర్పించడం వంటి ప్రక్రియలను పూర్తి చేయాల్సి వస్తోంది. అయితే ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ఇప్పటికే ఓటరుగా నమోదైన ఒక సాధారణ పౌరుడు మళ్లీ తన అర్హతను ఎందుకు నిరూపించుకోవాలి? ఒకవేళ అతని పేరు తొలగించబడితే దాన్ని తిరిగి చేర్చుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఎందుకు తిరగాలి? ఓటరు జాబితా నుంచి పేరు తొలగించడం వ్యవస్థకు సులభంగా జరిగి, తిరిగి ఓటు హక్కును పొందే బాధ్యత మాత్రం పూర్తిగా పౌరుడిపైనే పడటం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ ప్రక్రియ వల్ల అత్యధికంగా ఇబ్బంది పడేది పేదలు, వలస కార్మికులు, వృద్ధులు, నిరక్షరాస్యులు, డిజిటల్ సౌకర్యాలు లేని కుటుంబాలు, సరైన పత్రాలు అందుబాటులో లేని వారు అనే ఆందోళన వ్యక్తమవుతోంది. నగరాలకు ఉపాధి కోసం వలస వెళ్లిన కార్మికుడు తన స్వగ్రామంలోని ఓటరు జాబితాలో పేరు తొలగించబడిందనే విషయం ఎలా తెలుసుకుంటాడు? ఒంటరిగా జీవిస్తున్న వృద్ధుడు ఆన్‌లైన్‌లో తన పేరు తనిఖీ చేసుకోలేకపోతే ఏమవుతుంది? నిరక్షరాస్యుడైన పేద పౌరుడు దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయలేకపోతే అతని ఓటు హక్కుకు ఎవరు బాధ్యత వహిస్తారు? ఇవన్నీ ఇప్పుడు అత్యంత కీలకమైన ప్రశ్నలుగా మారుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా కనిపిస్తోంది. సర్‌కు ముందు సుమారు 1.45 కోట్ల మంది ఓటర్లు ఉండగా, డ్రాఫ్ట్ జాబితాలో వారి సంఖ్య 97.53 లక్షలకు పడిపోయినట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. అంటే దాదాపు 47.7 లక్షల మంది పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో కనిపించడం లేదు. మొత్తంగా 32.8 శాతం ఓటర్ల పేర్లు తొలగించబడినట్లు తెలుస్తోంది. దేశ రాజధానిలోనే ఇంత భారీ స్థాయిలో ఓటర్ల జాబితాలో మార్పులు చోటుచేసుకోవడం సహజంగానే అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇంతమంది నిజంగానే వలస వెళ్లిపోయారా? వీరిలో అందరూ అర్హత లేని వారేనా? లేక ప్రక్రియలో లోపాల కారణంగా అర్హులైన ఓటర్లు కూడా జాబితా నుంచి తప్పిపోయారా? అనే ప్రశ్నలకు పూర్తి స్థాయిలో పారదర్శకమైన సమాధానం రావాల్సి ఉంది. తెలంగాణలోనూ సర్ ప్రభావం గణనీయంగానే కనిపిస్తోంది. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 21.7 శాతం ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో తొలగించబడినట్లు తెలుస్తోంది. అంటే ప్రతి ఐదుగురు ఓటర్లలో ఒకరి పేరు జాబితాలో కనిపించని పరిస్థితి ఏర్పడిందనే ఆందోళన వ్యక్తమవుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పేదలు, వలస కూలీలు, అద్దె ఇళ్లలో నివసించే కార్మికులు, వృద్ధులు, డిజిటల్ వ్యవస్థకు దూరంగా ఉన్న ప్రజలు తమ పేరు తొలగించబడిందనే విషయం కూడా తెలుసుకోలేని పరిస్థితి ఉంటే వారి ఓటు హక్కును ఎవరు కాపాడతారు? ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రానికి వెళ్లిన తర్వాత తమ పేరు జాబితాలో లేదని తెలుసుకునే పరిస్థితి వస్తే ఆ పౌరుడికి జరిగే నష్టానికి పరిష్కారం ఏమిటి? మహారాష్ట్రలోనూ పరిస్థితి కోట్ల సంఖ్యలో ఓటర్ల పేర్లు తగ్గినట్లు కనిపిస్తోంది. సర్‌కు ముందు 9.78 కోట్ల మంది ఓటర్లు ఉండగా, డ్రాఫ్ట్ జాబితాలో ఆ సంఖ్య 7.71 కోట్లకు పడిపోయింది. అంటే సుమారు 2.07 కోట్ల మంది పేర్లు డ్రాఫ్ట్ జాబితాలో కనిపించడం లేదు. మరణించినవారు, శాశ్వతంగా వలస వెళ్లినవారు, గైర్హాజరు, ఇతర ప్రాంతాలకు మారినవారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైనవారు వంటి కారణాలను అధికారికంగా ప్రస్తావిస్తున్నప్పటికీ, ఇంత భారీ స్థాయిలో పేర్లు తగ్గడంపై పూర్తి పారదర్శకత అవసరమనే డిమాండ్ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా అత్యధికంగా ఓటర్ల పేర్లు తగ్గిన ప్రాంతాలను పరిశీలిస్తే ఢిల్లీ 32.8 శాతంతో ముందంజలో ఉండగా, దాద్రా-నగర్ హవేలీ, డామన్-దయ్యూ ప్రాంతాల్లో 29.6 శాతం, తెలంగాణలో 21.7 శాతం, మహారాష్ట్రలో 21.1 శాతం, అండమాన్ అండ్ నికోబార్ ప్రాంతాల్లో 20.6 శాతం మేర ఓటర్ల సంఖ్య తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. మూడు దశల్లో కలిపి 13.37 కోట్ల మంది ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ రోల్స్ నుంచి తొలగించబడటం ఇప్పుడు సాధారణ పరిపాలనా ప్రక్రియగా మాత్రమే చూడలేమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పేరు తప్పుగా తొలగించబడితే నిర్ణీత గడువులోపు తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని ఎన్నికల వ్యవస్థ చెబుతోంది. కానీ అసలు సమస్య అక్కడే ఉంది. తమ పేరు తొలగించబడిందనే సమాచారం ప్రతి ఓటరికి చేరుతుందా? గ్రామాల్లో ఉన్న వృద్ధులకు, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిన కార్మికులకు, పేదలకు, నిరక్షరాస్యులకు, ఇంటర్నెట్ సౌకర్యం లేని కుటుంబాలకు ఈ సమాచారం ఎలా చేరుతుంది? నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకోలేకపోతే ఏమవుతుంది? పత్రాలు సేకరించలేకపోతే? కార్యాలయాల చుట్టూ తిరగలేని పరిస్థితిలో ఉంటే? చివరికి ఎన్నికల రోజున తన పేరు లేదని తెలిసిన పౌరుడు తన ఓటు హక్కును కోల్పోతే ఆ బాధ్యత ఎవరిది?




నకిలీ ఓటర్లను తొలగించడం, మరణించిన వారి పేర్లను తొలగించడం, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన పేర్లను సరిచేయడం ఎన్నికల వ్యవస్థను పారదర్శకంగా ఉంచడానికి అవసరమే. కానీ అదే సమయంలో ఒక్క అర్హత కలిగిన పౌరుడి పేరు కూడా పొరపాటున తొలగించబడకుండా చూడటం అంతకంటే ముఖ్యమైన బాధ్యత. ఒక నకిలీ ఓటును తొలగించడం ఎన్నికల స్వచ్ఛతకు అవసరమైతే, ఒక నిజమైన ఓటరును పొరపాటున జాబితా నుంచి తొలగించడం అతని ప్రజాస్వామ్య హక్కుపై దెబ్బ అవుతుందనే వాదన వినిపిస్తోంది. 'ఒక దేశం--ఒక ఎన్నిక' వంటి ఎన్నికల సంస్కరణలపై దేశంలో చర్చ జరుగుతున్న సమయంలో కోట్లాది మంది ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించబడటం రాజకీయంగా కూడా అనేక ప్రశ్నలను తెరపైకి తెస్తోంది. ఈ తొలగింపులు కేవలం పరిపాలనా సవరణలో భాగమేనా? లేక ఈ ప్రక్రియలో అర్హులైన ఓటర్లు కూడా నష్టపోతున్నారా? ప్రతి తొలగింపుకు స్పష్టమైన కారణం ఏమిటి? ఎంతమందికి ముందస్తు సమాచారం అందింది? ఎంతమంది నిజంగా మరణించారు? ఎంతమంది వలస వెళ్లారు? ఎంతమంది పేర్లు పొరపాటున తొలగించబడ్డాయి? ఎంతమంది తిరిగి దరఖాస్తు చేసుకున్నారు? అనే వివరాలను ప్రజలకు పూర్తిగా, పారదర్శకంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఓటు హక్కు కోసం సాధారణ పౌరుడు ప్రభుత్వ యంత్రాంగం చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఓటరును జాబితా నుంచి తొలగించే ముందు అతనికి స్పష్టమైన సమాచారం అందించడం, అభ్యంతరం తెలిపేందుకు తగిన సమయం ఇవ్వడం, గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించడం, వృద్ధులు మరియు దివ్యాంగులకు సహాయక వ్యవస్థ ఏర్పాటు చేయడం, వలస కార్మికులకు సులభమైన విధానం అందించడం వంటి చర్యలు అత్యవసరం. ఎందుకంటే ప్రతి సంఖ్య వెనుక ఒక మనిషి ఉన్నాడు. ప్రతి పేరు వెనుక ఒక పౌరుడి హక్కు ఉంది. ప్రతి ఓటు వెనుక ఒక కుటుంబం భవిష్యత్తు ఉంది. ఓటు అనేది కేవలం ఓటర్ల జాబితాలో ఉండే పేరు కాదు.. అది దేశ పాలకులను ఎన్నుకునే పౌరుడి శక్తి. ఓటు హక్కు పౌరుడి బాధ్యత మాత్రమే కాదు.. దాన్ని రక్షించడం ప్రభుత్వ వ్యవస్థల రాజ్యాంగబద్ధమైన బాధ్యత కూడా. కోట్లాది మంది పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించబడుతున్న ఈ సమయంలో అసలు ప్రశ్న ఒక్కటే---నకిలీ ఓట్లను తొలగించే పేరుతో ఒక్క నిజమైన ఓటు కూడా గల్లంతు కాకుండా వ్యవస్థ ఏం చేస్తోంది? ప్రజాస్వామ్యానికి ప్రాణం పోసేది ఓటే అయితే.. ఆ ఓటు హక్కుకు పడుతున్న ఈ భారీ కోతపై దేశం సమాధానం కోరాల్సిన సమయం ఆసన్నమైంది.

# కొండా సురేఖపై వేటు?

**ఏఐసీసీ తుది నిర్ణయంపై ఉత్కంఠ**
**మంత్రి పదవి నుంచి తప్పించే అంశంపై చర్చలు**
**అధిష్ఠానానికి తన వాదన వినిపించిన కొండా సురేఖ**
**జి. చిన్నారెడ్డి భవితవ్యంపైనా సందిగ్ధత**
**నేడు అధికారిక నిర్ణయం వెలువడే అవకాశం**
**డాక్టర్ బరిగెల శివ**




**ఢిల్లీ/హైదరాబాద్ (జై భీమ్ న్యూస్):**

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు మరోసారి తీవ్ర చర్చకు దారితీశాయి. మంత్రి కొండా సురేఖపై క్రమశిక్షణ చర్యలు తీసుకునే విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం మొగ్గుచూపినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గం నుంచి ఆమెను తప్పించే అంశంపై ఢిల్లీ కేంద్రంగా కాంగ్రెస్ అగ్రనేతలు, తెలంగాణ ముఖ్యనేతల మధ్య విస్తృత చర్చలు జరిగినట్లు సమాచారం. ఇదే సమయంలో కాంగ్రెస్ సీనియర్ నేత జి. చిన్నారెడ్డి విషయంలోనూ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందన్న వార్తలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. కొండా సురేఖ వ్యవహారం గత కొద్ది రోజులుగా తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర దుమారం రేపుతున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు పలువురు ముఖ్య నాయకులు ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలను కలిసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌లతో తెలంగాణ నాయకులు వరుసగా సమావేశమై ప్రస్తుత పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ కూడా ఢిల్లీలోనే ఉండి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి తన వాదనను వినిపించినట్లు తెలుస్తోంది. పార్టీలో తనకు వ్యతిరేకంగా కుట్ర జరుగుతోందని పేర్కొంటూ తనవైపు ఉన్న వివరాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌తో కూడా ఆమె సమావేశమై తన అభిప్రాయాన్ని వివరించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఈ సమావేశాల అనంతరం కూడా కొండా సురేఖపై చర్యలు తీసుకునే విషయంలో అధిష్ఠానం వెనక్కి తగ్గలేదన్న ప్రచారం జరుగుతోంది. ఇక్కడే అసలు ప్రశ్నలు మొదలవుతున్నాయి. పార్టీలో విభేదాలు రావడం కొత్తేమీ కాదు. కానీ ఆ విభేదాలను పరిష్కరించకుండా, ప్రశ్నించే నాయకులపైనే క్రమశిక్షణ చర్యల కత్తి వేలాడదీయడం ఎంతవరకు సమంజసం అన్న చర్చ ఇప్పుడు కాంగ్రెస్‌లోనే జరుగుతోంది. పార్టీ క్రమశిక్షణ పేరుతో చర్యలు తీసుకుంటే ఆ క్రమశిక్షణ అందరికీ సమానంగా వర్తిస్తుందా? లేక అధికార కేంద్రానికి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపైనే చర్యలు ఉంటాయా? అన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

కొండా సురేఖ వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి కూడా చర్యలకు గట్టిగా పట్టుబట్టినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. పీసీసీ స్థాయిలోనూ చర్యలకు సంబంధించిన చర్చలు జరిగాయని, క్రమశిక్షణ కమిటీ కూడా తన అభిప్రాయాన్ని వెల్లడించిందని సమాచారం. అయితే కొండా సురేఖ మాత్రం తనపై జరుగుతున్న పరిణామాలను ప్రశ్నిస్తూ, పార్టీ నియమాలు అందరికీ ఒకేలా ఉండాలని తన వాదనను వినిపించినట్లు తెలుస్తోంది. ముందుగా సీఎంపైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆమె చేసిన వ్యాఖ్యలు ఈ వివాదాన్ని మరింత ముదిర్చినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ సీనియర్ నేత జి. చిన్నారెడ్డి భవితవ్యంపైనా ఉత్కంఠ నెలకొంది. ఆయనను ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తొలగించే అంశంపై కూడా అధిష్ఠానం చర్చించినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒకేసారి ఇద్దరు సీనియర్ నాయకులపై చర్యలకు రంగం సిద్ధమవుతోందన్న వార్తలు తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీస్తున్నాయి. ఢిల్లీలో బుధవారం రోజంతా తెలంగాణ కాంగ్రెస్ నాయకుల భేటీలు కొనసాగడం ఈ వ్యవహారానికి మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. సీఎం రేవంత్ రెడ్డి కేసీ వేణుగోపాల్‌తో, అనంతరం మల్లికార్జున ఖర్గేతో సమావేశమయ్యారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కూడా పార్టీ అగ్రనేతలతో చర్చలు జరిపారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖర్గేతో సమావేశమై రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై మాట్లాడినట్లు సమాచారం. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా మీనాక్షి నటరాజన్‌తో సమావేశమైనట్లు తెలుస్తోంది. ఇదే సమయంలో కొండా సురేఖ కూడా తనవైపు వాదనను అధిష్ఠానం ముందు బలంగా వినిపించే ప్రయత్నం చేశారు. అయితే ఇన్ని సమావేశాలు, ఇన్ని మంతనాల తర్వాత కూడా అసలు సమస్యకు పరిష్కారం ఏమిటన్నది ప్రశ్నార్థకంగానే కనిపిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్‌లో విభేదాలు నిజంగానే కేవలం ఒక మంత్రి వ్యాఖ్యలతో మాత్రమే మొదలయ్యాయా? లేక ఇప్పటికే పార్టీలో కొనసాగుతున్న అంతర్గత అసంతృప్తి ఇప్పుడు బయటపడిందా? అన్నది కూడా రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. మంత్రి పదవి నుంచి కొండా సురేఖను తొలగించాలంటే రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. ముఖ్యమంత్రి సిఫారసు మేరకు గవర్నర్‌కు అధికారికంగా సమాచారం అందించి తదుపరి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అధిష్ఠానం నుంచి అధికారిక నిర్ణయం వెలువడిన తర్వాతే ఈ ప్రక్రియపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అదే విధంగా చిన్నారెడ్డి విషయంలో కూడా అధికారిక ఉత్తర్వులు వెలువడితేనే ఆయన పదవిపై స్పష్టత వస్తుంది. అయితే ప్రస్తుతం వస్తున్న సమాచారం అంతా పార్టీ వర్గాల ద్వారా జరుగుతున్న ప్రచారంపైనే ఆధారపడి ఉంది. కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి కానీ, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కానీ అధికారికంగా తుది ప్రకటన వెలువడాల్సి ఉంది. అందువల్ల కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తప్పించడం ఖాయమైందని లేదా చిన్నారెడ్డిని పదవి నుంచి తొలగించడం ఖరారైందని అధికారిక ప్రకటన వచ్చే వరకు చెప్పలేని పరిస్థితి ఉంది. అయినా తెలంగాణ కాంగ్రెస్‌లో జరుగుతున్న తాజా పరిణామాలు మాత్రం ఒక విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత అంతర్గత విభేదాలు బయటకు రాకుండా చూసుకోవాల్సిన కాంగ్రెస్ నాయకత్వం, ఇప్పుడు వాటిని ఢిల్లీ స్థాయి వరకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందన్న ప్రశ్న ఎదుర్కొంటోంది. సమస్యలను పరిష్కరించే రాజకీయ సంస్కృతి కంటే, విభేదించే వారిపై చర్యలు తీసుకోవడమే పరిష్కారంగా మారితే భవిష్యత్తులో మరిన్ని అసంతృప్త స్వరాలు బయటకు రావా అన్న సందేహం వ్యక్తమవుతోంది. ఇప్పుడు అందరి దృష్టి ఏఐసీసీ తుది నిర్ణయంపైనే ఉంది. కొండా సురేఖపై నిజంగానే వేటు పడుతుందా? చిన్నారెడ్డిపై కూడా చర్యలు ఉంటాయా? లేక చివరి నిమిషంలో రాజకీయ సమీకరణాలు మారతాయా? అన్నది నేడు వెలువడే అధికారిక నిర్ణయంతోనే స్పష్టమయ్యే అవకాశం ఉంది. అయితే ఈ మొత్తం వ్యవహారంలో కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకునే నిర్ణయం ఇద్దరు నాయకుల రాజకీయ భవిష్యత్తుకే పరిమితం కాకుండా, తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం, క్రమశిక్షణ, నాయకత్వంపై కొత్త చర్చకు తెరలేపడం మాత్రం ఖాయంగా కనిపిస్తోంది.

# భద్రకాళి మాడవీధుల టెండర్‌పై ఉత్కంఠ!

**రూ.19 కోట్లతో రెండో విడత మాడవీధుల నిర్మాణం**
**నేటితో టెండర్ల దాఖలుకు ముగియనున్న గడువు**
**సాయంత్రం సాంకేతిక బిడ్ల పరిశీలన**
**శుక్రవారం కాంట్రాక్టు ఖరారయ్యే అవకాశం**
**పాత కాంట్రాక్టర్‌కా.. కొత్త సంస్థకా?**



**వరంగల్ (జై భీమ్ న్యూస్):**

ప్రముఖ భద్రకాళి ఆలయం రెండో విడత మాడవీధుల నిర్మాణ పనులకు సంబంధించిన సుమారు రూ.19 కోట్ల భారీ టెండర్ ఇప్పుడు తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ పనులకు టెండర్లు దాఖలు చేసేందుకు గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు గడువు ఉండటంతో, ఈ ప్రతిష్టాత్మక కాంట్రాక్టును ఎవరు దక్కించుకుంటారన్నది చర్చనీయాంశంగా మారింది. టెండర్ల దాఖలు ప్రక్రియ ముగిసిన అనంతరం గురువారం సాయంత్రం అధికారులు సాంకేతిక బిడ్లను పరిశీలించనున్నట్లు సమాచారం. అన్ని సాంకేతిక అర్హతలను పరిశీలించిన తర్వాత, ఆర్థిక బిడ్లు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని శుక్రవారం టెండర్‌ను ఖరారు చేసే అవకాశం ఉందని కూడా అధికారులు చెబుతున్నారు. అయితే, రూ.19 కోట్ల విలువైన ఈ మాడవీధుల నిర్మాణ కాంట్రాక్టు ఇప్పటికే పనులు చేపట్టిన పాత కాంట్రాక్టర్‌కే దక్కుతుందా? లేక కొత్త కాంట్రాక్టర్లు పోటీలోకి వచ్చి టెండర్‌ను దక్కించుకుంటారా? అన్న అంశంపై నగరంలో ఉత్కంఠ నెలకొంది. ముఖ్యంగా భద్రకాళి ఆలయ అభివృద్ధి పనులు కావడంతో ఈ టెండర్‌పై కాంట్రాక్టర్లతో పాటు రాజకీయ, వ్యాపార వర్గాలు కూడా ఆసక్తిగా గమనిస్తున్నాయి. ఇదిలా ఉండగా, కుడా పరిధిలో జరుగుతున్న కొన్ని అభివృద్ధి పనుల టెండర్లు పదేపదే ఒకరిద్దరు కాంట్రాక్టర్లకే దక్కుతున్నాయనే విమర్శలు ఇప్పటికే వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భద్రకాళి మాడవీధుల రూ.19 కోట్ల టెండర్ ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందా? అన్ని అర్హత కలిగిన కాంట్రాక్టర్లకు సమాన అవకాశం కల్పిస్తారా? లేక మళ్లీ అదే వర్గాలకు పనులు దక్కుతాయా? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. ప్రజల సొమ్ముతో చేపడుతున్న ఇలాంటి భారీ అభివృద్ధి పనుల్లో పూర్తి పారదర్శకత పాటించాలని, టెండర్ నిబంధనలు, అర్హతలు, సాంకేతిక పరిశీలన, ఆర్థిక బిడ్ల ఎంపిక వంటి అంశాలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని పలువురు కోరుతున్నారు. మొత్తానికి, భద్రకాళి మాడవీధుల నిర్మాణానికి సంబంధించిన రూ.19 కోట్ల టెండర్ ఎవరికి దక్కుతుంది? పాత కాంట్రాక్టర్ మళ్లీ కాంట్రాక్టును చేజిక్కించుకుంటారా? లేక కొత్త సంస్థకు అవకాశం దక్కుతుందా? అన్న ఉత్కంఠకు శుక్రవారం తెరపడే అవకాశం ఉంది. టెండర్ ప్రక్రియపై ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

# డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డికి కాంగ్రెస్ నేతల ఘన నివాళి

**టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను**



**పరకాల, 2 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



పేదల పెన్నిధి, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కాంగ్రెస్ పార్టీలో కొత్త తరం నాయకులను తీర్చిదిద్దిన మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఉదయం టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను ముఖ్యఅతిథిగా హాజరై వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మడికొండ శ్రీను మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా పేద ప్రజల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేసి, వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గూడెల్లి సదన్ కుమార్, నాయకులు అల్లం రఘు నారాయణ, బొచ్చు భాస్కర్, లక్కం వసంత శంకర్, దాసరి ఉమా, పసుల బంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఫిజికల్ డైరెక్టర్ల జనరల్ బాడీ సమావేశం

**కేయూ క్యాంపస్, 2 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ పరిధిలోని వివిధ కళాశాలల ఫిజికల్ డైరెక్టర్ల జనరల్ బాడీ సమావేశం సెప్టెంబర్ 3న అనగా ఈ రోజు నిర్వహించనున్నారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, లా కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ఉదయం 11 గంటలకు యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో సమావేశం జరగనుంది. వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వీ. రామచంద్రం, ఓఎస్డీ ప్రొఫెసర్ బి. వెంకట్రాం రెడ్డి, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి. మనోహర్ తదితరులు సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా 2026--27 అంతర్ విశ్వవిద్యాలయ క్రీడా క్యాలెండర్ రూపకల్పన, క్రీడా మైదానాల అభివృద్ధి, క్రీడా కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించనున్నారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు తమ కళాశాలల నుంచి జారీ చేసిన సర్వీస్ సర్టిఫికెట్‌తో తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య కోరారు.




# పాలిటెక్నిక్ కళాశాలలను ఇతర శాఖల పరిధిలోకి మార్చొద్దు

## టీజీ ఎస్‌బీటీఈటీ పరిధిలోనే కొనసాగించాలి.. వరంగల్‌లో విద్యార్థుల నిరసన

**వరంగల్, 2 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలన్న ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు నిరసన చేపట్టారు. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద నిర్వహించిన ఆందోళనలో విద్యార్థులు తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎంఎస్ నం.97లో రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని పేర్కొనడంపై విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి పరిధిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ఇతర ప్రభుత్వ శాఖలు లేదా శాఖాధీన సంస్థల పరిధిలోకి బదిలీ చేయాలనే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సాంకేతిక విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

### ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, బోధనేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సిబ్బంది కొరత కారణంగా విద్యార్థుల విద్యకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కళాశాలల్లో ప్రయోగశాలలు, కార్యశాలలు, తరగతి గదులు, వసతి గృహాలు తదితర మౌలిక వసతులను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేసేందుకు అవసరమైన నిధులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు.

### చర్చల తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలి

విద్యార్థుల విద్యా భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాలను ఏకపక్షంగా తీసుకోకుండా విద్యార్థులు, అధ్యాపకులు, విద్యా నిపుణులతో చర్చించిన తర్వాతే అమలు చేయాలని విద్యార్థులు కోరారు. ప్రస్తుత పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థలో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు ఖాళీలను భర్తీ చేసి, మౌలిక వసతులను మెరుగుపరచడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాలిటెక్నిక్ కళాశాలలను టీజీ ఎస్‌బీటీఈటీ పరిధిలోనే కొనసాగించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి, మౌలిక వసతులు కల్పించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జస్వంత్, వినీత్, దర్శిత్, చరణ్, రుషిత్, రామ్‌చరణ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు. "పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి.. టీజీ ఎస్‌బీటీఈటీని బలోపేతం చేయాలి" అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు.

# 420 హామీలతో కాంగ్రెస్ ప్రజా పీడిత పాలన : దాస్యం వినయ్ భాస్కర్





### వెయ్యి రోజుల పాలన వైఫల్యాలపై ప్రజల ముందు ఛార్జ్‌షీట్

**హన్మకొండ, 2 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తూ ప్రజా పీడిత పాలన కొనసాగిస్తోందని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకెళ్తామని ఆయన అన్నారు. ప్రజల పక్షాన నిరసన కార్యక్రమాలు చేపడుతున్న తమను అక్రమ అరెస్టులతో అడ్డుకోలేరని స్పష్టం చేశారు. వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా కనుమరుగైందని ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జ్‌షీట్‌ను ప్రజల ముందు ఉంచుతున్నామని తెలిపారు. ఆరు గ్యారంటీల పేరుతో బాండ్ పేపర్లు రాసిచ్చి, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రజలను నమ్మించిందని అన్నారు. అయితే వెయ్యి రోజులు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే అభివృద్ధిలో అగ్రభాగంలో నిలిపితే, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అట్టడుగు స్థాయికి తీసుకెళ్లారని వినయ్ భాస్కర్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను సమీక్షించుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో విద్యార్థి, నిరుద్యోగులకు అన్యాయం

### ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్




**కేయూ క్యాంపస్, 2 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినప్పటికీ విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ విమర్శించారు. విద్యార్థి, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీ గ్రంథాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద నరేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులు, నిరుద్యోగులకు న్యాయం చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చదువు పూర్తిచేసి ఉన్నత విద్యకు వెళ్లాల్సిన విద్యార్థులకు ఫీజులు విడుదల కాకపోవడంతో కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలు సర్టిఫికెట్లు నిలిపివేస్తున్నాయని, దీంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, నాణ్యమైన భోజనం అందించడంలోనూ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రి నియామకం విషయంలోనూ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంద నరేష్ డిమాండ్ చేశారు. లేకపోతే గత ప్రభుత్వాలకు ఎదురైన పరిస్థితులే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ఎదురవుతాయని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కేయూ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇప్ప భరత్, ఉపాధ్యక్షులు ప్రణయ్, కార్తీక్, శ్రీను, రవి, దీక్షిత్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అరెస్టులతో నిరసనను అడ్డుకోలేరు

### కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ ఆందోళన.. మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



**హనుమకొండ, 2 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, బీఆర్ఎస్ నేత దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. ముందస్తు అనుమతి తీసుకున్నప్పటికీ నిరసన కార్యక్రమాన్ని అడుగడుగునా అడ్డుకున్నారని ఆయన అన్నారు. నిన్న అనుమతి ఇచ్చిన పోలీసులే నేడు తమను అక్రమంగా అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. 420 హామీలతో కూడిన ఫ్లెక్సీపై పండ్ల బండ్ల వారి కత్తులతో పోలీసులు దాడి చేశారని ఆయన ఆరోపించారు. ఆదాలత్ సర్కిల్ వద్ద దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు అరెస్టు చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసనను కొనసాగిస్తూ సుబేదారి జంక్షన్‌లో ఆందోళన చేపట్టారు. వినయ్ భాస్కర్‌కు సంఘీభావం తెలిపేందుకు మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 420 హామీలతో ప్రజా పీడిత పాలనను తలపిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో జరిగిన వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకెళ్తామని అన్నారు. ప్రజల పక్షాన నిరసనలు చేస్తున్న తమను అరెస్టులతో అడ్డుకోలేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కంటికి కనిపించడం లేదని ఆరోపించిన ఆయన.. వెయ్యి రోజులుగా రాష్ట్రంలో చోటుచేసుకున్న పరిణామాలు, ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జ్‌షీట్‌ను ప్రజల ముందు ఉంచుతున్నామని తెలిపారు. ఆరు గ్యారంటీల పేరుతో బాండ్ పేపర్లు రాసిచ్చి, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలను అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రజలను నమ్మించిందని అన్నారు. అయితే వెయ్యి రోజులు గడిచినా హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపితే, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అట్టడుగు స్థాయికి తీసుకువచ్చారని వినయ్ భాస్కర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో చేపట్టి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుంచుతామని దాస్యం వినయ్ భాస్కర్ తెలిపారు.

# కొండా సురేఖ వివాదం..

### ఆంధ్రజ్యోతికి ఇంత పంతం ఎందుకు? వరుస కథనాల వెనుక అసలు ఉద్దేశం ఏమిటి? వార్తా ప్రమాణాలపై ప్రశ్నలు



**హనుమకొండ, 2 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

రాజకీయ నాయకులపై విమర్శలు రావడం సహజం. అధికార పార్టీలో అంతర్గత విభేదాలు ఉండటం కూడా ప్రజాస్వామ్యంలో కొత్త విషయం కాదు. అయితే ఒక అంశాన్ని పదేపదే తెరపైకి తీసుకువస్తూ, వాస్తవ పరిస్థితికి మించి రాజకీయ ప్రకంపనలు ఉన్నట్టుగా చిత్రీకరిస్తే మాత్రం మీడియా పాత్రపై ప్రశ్నలు తలెత్తడం సహజం. మంత్రి కొండా సురేఖకు సంబంధించిన వివాదంపై ఆంధ్రజ్యోతి ప్రచురిస్తున్న వరుస కథనాలు ప్రస్తుతం ఇలాంటి చర్చకు దారితీస్తున్నాయి. పార్టీలో అంతర్గత అసంతృప్తి ఉంటే దానిని వార్తగా చెప్పడం ఒక అంశం. అయితే ఆ అసంతృప్తిని విస్తరించి, మరింత తీవ్రమైన రాజకీయ వ్యతిరేకత ఉన్నట్టుగా కథనాలను నిర్మించడం మరో అంశం.

**ఆధారాలు ఎక్కడ?**

ఒక మంత్రి పట్ల పార్టీలో వ్యతిరేకత ఉందని పేర్కొనడం తీవ్రమైన రాజకీయ అంశం. అలాంటి వార్తలకు బలమైన ఆధారాలు అవసరం. ఎవరు వ్యతిరేకిస్తున్నారు? ఎంతమంది నాయకులు అసంతృప్తితో ఉన్నారు? వారి అధికారిక అభిప్రాయం ఏమిటి? పార్టీ నాయకత్వం ఏం చెబుతోంది? వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. 'పార్టీలో వ్యతిరేకత', 'నేతల్లో అసంతృప్తి', 'వ్యతిరేక వర్గం' వంటి పదాలతో వరుస కథనాలు వెలువడితే పాఠకుడిలో ఒక నిర్దిష్ట రాజకీయ అభిప్రాయం ఏర్పడే అవకాశం ఉంటుంది. ఇక్కడే అసలు ప్రశ్న తలెత్తుతోంది---ఆ వార్తలు వాస్తవ పరిస్థితిని ప్రతిబింబిస్తున్నాయా? లేక ఒక రాజకీయ కథనాన్ని నిర్మిస్తున్నాయా?

**మీడియాకు ప్రమాణాలు ఒకటే కావాలి**

మంత్రి కొండా సురేఖ నిర్ణయాలు తప్పుగా ఉంటే విమర్శించాలి. ఆమె వ్యాఖ్యలు వివాదాస్పదంగా ఉంటే ప్రశ్నించాలి. ప్రభుత్వ విధానాల్లో లోపాలుంటే ఎత్తిచూపాలి. అది మీడియా బాధ్యతే. అయితే ఒక రాజకీయ నాయకుడి కుటుంబ సభ్యులు చేసిన వ్యాఖ్యలకు కూడా ఆ నాయకుడినే బాధ్యుడిగా చేయాలంటే, అదే ప్రమాణం ఇతర రాజకీయ నాయకుల విషయంలోనూ వర్తించాలి. గతంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యల విషయంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై ఇదే తరహా ప్రశ్నలు ఎందుకు లేవనెత్తలేదనే వాదన కూడా రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. ఒకరికి చిన్న తప్పు పెద్ద వార్తగా, మరొకరికి పెద్ద వివాదం చిన్న వార్తగా మారితే మీడియా నిష్పాక్షికతపై అనుమానాలు రావడం సహజం.

**'ఆస్థాన మీడియా' విమర్శలు ఎందుకు వస్తున్నాయి?**

తెలంగాణ రాజకీయాల్లో 'ఆస్థాన పత్రికలు' అనే విమర్శ కొత్తది కాదు. గతంలో కొన్ని మీడియా సంస్థలు నిర్దిష్ట రాజకీయ పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలను ఎదుర్కొన్నాయి. ఇప్పుడు అదే తరహా విమర్శలు ఆంధ్రజ్యోతిపై కూడా కొందరి నుంచి వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ మొత్తానికి కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తోందనే అభిప్రాయాలు కొందరు వ్యక్తం చేస్తున్నారు. ఇది ఒక ఆరోపణ మాత్రమే కావచ్చు. అయితే అలాంటి అనుమానం ఎందుకు కలుగుతోంది? అన్నది మాత్రం మీడియా సంస్థలు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశం. కాంగ్రెస్ పార్టీ అంటే ఒక్క నాయకుడి చుట్టూ తిరిగే వ్యవస్థ కాదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకత్వంతో కూడిన విస్తృత రాజకీయ వ్యవస్థ. అలాంటి పార్టీలో ప్రతి వివాదాన్ని కేవలం 'ముఖ్యమంత్రి వర్గం--వ్యతిరేక వర్గం' అనే రెండు కోణాల్లో చూడటం రాజకీయ వాస్తవాలను సరళీకరించడం అవుతుంది.

**పాఠకుడు ఇప్పుడు అన్నింటినీ పోల్చి చూస్తున్నాడు**

డిజిటల్ యుగంలో పాఠకుడు ఒక్క పత్రికపైనే ఆధారపడటం లేదు. ఒకే వార్తను వివిధ మీడియా సంస్థలు ఎలా రాశాయో పోల్చి చూస్తున్నాడు. అధికారిక ప్రకటన ఏమిటి? నాయకులు నిజంగా ఏమన్నారు? కథనంలో పేర్కొన్న అంశాలకు ఆధారాలు ఏమిటి? అనే విషయాలను పరిశీలిస్తున్నాడు.

**అందుకే మీడియా సంస్థలు ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి:**

**పాఠకుడికి వార్త కావాలి.. నిర్దేశిత అభిప్రాయం కాదు.**

ఒక నాయకుడిపై వరుసగా ప్రతికూల కథనాలు రావడం, అదే సమయంలో మరో నాయకుడి రాజకీయ చర్యలకు నిరంతరం సానుకూల ప్రాధాన్యం లభించడం వంటి పరిణామాలు కనిపిస్తే పాఠకుడు సహజంగానే ప్రశ్నలు వేసుకుంటాడు.

**ఆంధ్రజ్యోతికి ఆత్మపరిశీలన అవసరమా?**

ఆంధ్రజ్యోతి ఒక ప్రముఖ తెలుగు దినపత్రిక. దాని ప్రభావం విస్తృతంగా ఉంది. అందువల్ల దాని రాజకీయ కథనాలకు సహజంగానే ప్రాధాన్యం ఉంటుంది. అలాంటి సంస్థపై ఒక నాయకుడికి లేదా ఒక వర్గానికి అనుకూలంగా వ్యవహరిస్తోందనే అభిప్రాయం ఏర్పడటం ఆ సంస్థకే ఆలోచించాల్సిన అంశం. మీడియా ఏ పార్టీకి, ఏ నాయకుడికి, ఏ వర్గానికీ 'ఆస్థానం' కాకూడదు. మీడియా ప్రజలకు ఆస్థానం కావాలి. అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించాలి. ప్రతిపక్షంలో ఉన్నవారినీ ప్రశ్నించాలి. రాజకీయ విభేదాలను వాస్తవాల ఆధారంగా ప్రజల ముందుంచాలి. ఊహాగానాలను వాస్తవాలుగా, రాజకీయ అంచనాలను వార్తలుగా మార్చకుండా జాగ్రత్తపడాలి.

**కొండా సురేఖ వివాదం నేపథ్యంలో ఇప్పుడు నిలుస్తున్న అసలు ప్రశ్న ఇదే**

"వార్తను ప్రజలకు అందిస్తున్నారా? లేక రాజకీయ కథనాన్ని ప్రజలపై రుద్దుతున్నారా?" ఈ ప్రశ్నకు సమాధానం రాజకీయ నాయకుల నుంచి కాదు.. మీడియా సంస్థల పనితీరే ఇవ్వాలి.

## మాస్ సమ్మక్క మృతి ఉద్యమాలకు తీరని లోటు

### యంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి

**కమలాపూర్, 2 సెప్టెంబర్ 2026 (జై భీమ్ న్యూస్)**



మాస్ సమ్మక్క మృతి ప్రజా, ఉద్యమాలకు తీరని లోటని యంసిపిఐ (యు) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. సెప్టెంబర్ 1న పార్టీ రాష్ట్ర ప్రతినిధి బృందంతో కలిసి హనుమకొండ జిల్లా కమలాపురం మండలం మర్రిపల్లిగూడెం గ్రామంలో మాస్ సమ్మక్క కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన మాస్ సమ్మక్క తన కుమారుడు, నలుగురు కుమార్తెలను ప్రయోజకులుగా తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. 60 ఏళ్ల వయసులో ఆమె మరణించడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. మాస్ సమ్మక్క రెండో కుమార్తె మాస్ సావిత్రి విద్యార్థి ఉద్యమాల్లో, మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని, ప్రస్తుతం యంసిపిఐ (యు) రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. సావిత్రి ప్రజా ఉద్యమాల్లో ముందువరుసలో నిలిచి పనిచేయడం వెనుక ఆమె తల్లి సమ్మక్క ప్రోత్సాహం, కృషి ఎంతో ఉందన్నారు. అలాంటి ఉద్యమ కార్యకర్తను తీర్చిదిద్దిన సమ్మక్క మృతి బాధాకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్. రెడ్డి హంసారెడ్డి, కుంభం సుకన్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కర్ర రాజిరెడ్డి, గుండెబోయిన చంద్రయ్య, నీల రవీందర్, కుసుంబ బాపురావు, సింగతి మల్లికార్జున్, మాలోతు రాజేష్ నాయక్, వంగాల రాగసుధ, కనకం సంధ్య, తాండ్ర కళావతి తదితరులు పాల్గొన్నారు. అలాగే హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు చీపురు ఓదయ్య, మొగిలి శ్రీనివాసరావు, మంద భద్రయ్య, రాజేశ్వర్‌రావు, ప్రభాకర్‌రావు, బాబురావుతో పాటు పార్టీ సభ్యులు సౌజన్య తదితరులు పాల్గొన్నారు.